ఒకే పంటకు పరిమితం

- రెండేళ్ల క్రితం నిలిచిన పెద్దంపేట – రాయదండి ఎత్తిపోతలు
- ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్ వైర్ చోరీ
- రెండో పంటకు సాగునీరు అందించాలని అన్నదాతల వినతి

రామగుండం: గోదావరినది పరివాహక గ్రామాల పరిధిలోని మెట్ట ప్రాంతం ఆయకట్టు భూములను ఎస్సారెస్పీ కాలువలకు అనుసంధానం లేకుండా ఎత్తిపోతలతోనే తడుపుకునే దుస్థితి నెలకొంది. నియోజకవర్గ పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి వినియోగంపై అధికారుల సమగ్ర ప్రణాళిక లోపించడంతో వందశాతం తాగు, సాగు అవసరాలను తీర్చలేకపోతున్నారు.


పెద్దంపేట-రాయదండి ఎత్తిపోతల పంపుహౌస్

సాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న విలేజి అంతర్గాం, పెద్దంపేట, రాయదండి గ్రామాల రైతులను భాగస్వాములుగా చేసేందుకు రూ.4.60 లక్షల నిధులు సేకరించి ఎత్తిపోతలు స్థాపించేందుకు ప్రభుత్వానికి డిపాజిట్ చేశారు. గోదావరి ఒడ్డున 2013లో రూ.8కోట్ల మైనర్ ఇరిగేషన్ నిధులతో అప్పటి రామగుండం ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ మెట్ట ప్రాంత భూములకు రెండు పంటలకు సమృద్ధిగా సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారు.

ఎత్తిపోతలు నిలిచిపోవడానికి కారణాలు..

రెండేళ్ల క్రితం గోదావరిలో భారీ వరదలు వచ్చి తగ్గిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్ చోరీ చేశారు. కాగా 2013 నుంచి 2021 వరకు సాఫీగా ఎత్తిపోతలు కొనసాగగా తర్వాత కాళేశ్వరం ఎత్తిపోతలు నిలిచిపోయి బ్యాక్ వాటర్ లేకుండా పోయింది. మరోవైపు ఎల్లంపల్లి ప్రాజెక్టు దిగువకు నీటిని వదలకపోవడంతో గోదావరిలో నీటి ప్రవాహం నిలిచి భూగర్భంలోని పైపులకు నీరందని పరిస్థితి నెలకొంది. ఓవైపు ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం, గోదావరిలో నీటి ఎద్దడి ఫలితంగా ఎత్తిపోతలు నిలిచిపోయాయి. దీంతో దీని కింద ఉన్న 1500 ఎకరాల ఆయకట్టు భూములు ఏడాదిలో ఒకే పంట సాగు చేసుకునే దుస్థితి ఏర్పడింది.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ బిగింపునకు అంచనాలు

రాయదండి పంపుహౌస్‌కు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. దీనికి సంబంధించి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ఇప్పటికే అంచనాలు సిద్ధం చేసి టెండర్లను ఆహ్వానించేందుకు కార్యాచరణ చేశాం. త్వరలోనే నూతన ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు ప్రక్రియను పూర్తి చేసి పంపుహౌస్ ఆయకట్టు మెట్ట ప్రాంత రైతులకు సాగునీరందిస్తాం.

– బుచ్చిబాబు, ఇరిగేషన్ డీఈ

వినియోగంలోకి తీసుకురావాలి



రెండేళ్ల క్రితం మూతపడిన ఎత్తిపోతల పథకంతో నాకున్న రెండెకరాలు ఒక పంట సాగుకే పరిమితమైంది. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దష్టిసారించి ఎత్తిపోతలను సత్వరమే వినియోగంలోకి తీసుకువస్తే రైతాంగానికి మేలు జరుగుతుంది.

– కొలిపాక శంకర్‌రెడ్డి, రైతు, పెద్దంపేట

ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కరువు



ఎత్తిపోతల పథకం వద్ద ఉన్న విలువైన ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ లేకుండా పోయింది. గుర్తు తెలియని వ్యక్తులు వాటిని ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్ చోరీ చేయడంతో ఎత్తిపోతలకు బ్రేక్ పడింది. ప్రభుత్వం పంపుహౌస్ చుట్టుపక్కలా సీసీ కెమెరాలతో పాటు విద్యుత్ పెన్షన్ అమర్చితేనే సామగ్రికి రక్షణ ఉంటుంది.

– వేముల శ్రీనివాస్, రైతు, పెద్దంపేట

క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



రెండేళ్ల క్రితం మూతపడిన ఎత్తిపోతల పంపుహౌస్‌ను ఇరిగేషన్ అధికారులు పరిశీలించి శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలి. అదేవిధంగా ఎత్తిపోతలతో సమృద్ధిగా రెండు పంటలకు సాగునీరందే విధంగా అధికారుల సహకారం అవసరం.

– గోలి సత్తయ్య, రైతు, పెద్దంపేట

వైభవంగా వసంత పంచమి వేడుకలు


పెద్దపల్లిరూరల్: కోదండరామాలయంలో..


కాల్వశ్రీరాంపూర్: జ్ఞాన సరస్వతి ఆలయంలో..


ధర్మారం: పిల్లలకు అక్షరాభ్యాసం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో వసంతపంచమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమయజ్ఞాలు నిర్వహించారు. శాంతినగర్‌లోని శ్రీకోదండరామాలయంలో హోమయజ్ఞం నిర్వహించి అన్నదానం చేశారు. మండలంలోని రాగినేడులోని నాగలింగేశ్వరాలయంలోనూ వసంతపంచమి వేడుకలు జరిగాయి.

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్, మంగపేట గ్రామాల్లో జ్ఞాన సరస్వతి ఆలయాల్లో వేదండితులు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఆయా గ్రామాల్లో మాజీ ఎంపీపీ సంపత్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, అర్చక పూజారులు సుదీర్‌శర్మ, దత్తాత్రేయ శర్మ, కృష్ణ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామాల్లో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ధర్మారం: మండల కేంద్రంలోని అమ్మాభగవాన్ పరంజ్యోతి ఆలయంలో వసంత పంచమిని పురస్కరించుకుని సోమవారం చిన్నారులకు అమ్మా భగవాన్ ప్రతినిధి అక్షరాభ్యాసం చేయించారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం విద్యాలయాల్లో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని డి-టైప్ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త సుజాత చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.


జ్యోతినగర్: చిన్నారులకు అక్షరాభ్యాసం

సుల్తానాబాద్: పట్టణంలో ఉన్న శివాలయంలో వసంత పంచమి సందర్భంగా క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు.

సంక్షిప్త వార్తలు

• రిటైర్డ్ పీఈటీకి సన్మానం

ఎలిగేడు: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ పీఈటీ గ్యాజంగి సత్యనారాయణను సోమవారం మాజీ వైస్ ఎంపీపీ బుర్ర వీరస్వామిగౌడ్ ఆయన కార్యాలయంలో సన్మానించారు. మల్లేశంగౌడ్, చందూగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

• ఘనంగా శ్రీచెన్నకేశవస్వామి కల్యాణోత్సవం

పాలకుర్తి: మండల పరిధిలోని గుడిపల్లి గ్రామ శివారులోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీవకులాభరణం ప్రవీణ్‌ఆచార్యులు ఆధ్వర్యంలోని వేదపండితుల బృందం కల్యాణోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గుడిపల్లి, పుట్నూర్, జయ్యారం గ్రామాలతో పాటు ధర్మారం, వెల్గటూర్, పెద్దపల్లి తదితర మండలాల పరిధిలోని గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా రథోత్సవం నిర్వహిస్తారు.

• దొమ్మచెరువును ఎస్సారెస్పీ నీటితో నింపాలి

ధర్మారం: మండలంలోని పెర్కపల్లి గ్రామశివారులోని దొమ్మచెరువును శ్రీరాంసాగర్ నీటితో నింపి పంట పొలాలను కాపాడాలని ఆ గ్రామ రైతులు సోమవారం తహసీల్దార్ అరిఫోద్దిన్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం రైతులు మాట్లాడారు. ఈ చెరువు కింద 160 ఎకరాల ఆయకట్టు ఉందని, పూర్తిస్థాయిలో నాటు వేసినట్లు తెలిపారు. అయితే చెరువులో నీటిమట్టం తగ్గడంతో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చెరువు కట్ట తూము నుంచి నీరు పంట పొలాలకు రాకుండా వెల్డింగ్ చేసి తూము మూసివేశారని వాపోయారు. చెరువులో నీటి మట్టం తగ్గితే డీ-83బి కెనాల్‌కు ఏర్పాటు చేసిన 1ఎల్ కాల్వ ద్వారా నీటిని చెరువులోకి తరలించే అవకాశం ఉందన్నారు. అయితే అధికారులు రైతుల గురించి పట్టించుకోకుండా తూము మూసివేయడం అన్యాయమన్నారు. అధికారులు వెంటనే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటితో చెరువును నింపి రైతులకు సాగునీరందించాలని కోరారు.

• తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం హన్మంతునిపేట గ్రామానికి చెందిన వడ్లకొండ లక్ష్మయ్య అనే గీతకార్మికుడు సోమవారం తాటిచెట్టుపై నుంచి జారికింద పడడంతో గాయాలపాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. స్థానికులు వెంటనే పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

• పోస్టర్ ఆవిష్కరణ

ఓదెల: మండలంలోని గూడెంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయాలని 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్షడప్పులు-వేలగొంతులకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రేగుల సంపత్, తిప్పారపు ప్రభాకర్, రమేశ్, రాంచంద్రం ఉన్నారు.

కోడ్ కూసింది.. ముసుగు పడింది


విగ్రహానికి ముసుగు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సుల్తానాబాద్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న విగ్రహాలకు మున్సిపల్ సిబ్బంది ముసుగు వేశారు. సోమవారం పలు ప్రాంతాల్లో ఉన్న జాతీయ నాయకుల విగ్రహాలతో పాటు స్థానిక నాయకుల విగ్రహాలకు ముసుగు వేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ముసుగు వేశారు.

శ్రీపాతాళేశ్వరాలయంలో సామూహిక అక్షరాభ్యాసం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామ శ్రీపాతాళేశ్వరాలయంలో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. గ్రామంలోని చిన్నారులతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ముర్మూర్ అంగన్‌వాడీ టీచర్ పెండ్యాల విమలమ్మ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేయించారు. సీడీపీవో అలేఖ్య పటేల్, మండల సూపర్‌వైజర్ అంజలి, ఆలయ పూజారులు కమ్మల సత్యనారాయణశర్మ, వివిధ కేంద్రాల టీచర్స్, ఆయాలు ఉన్నారు.

తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు


బోరును పరిశీలిస్తున్న అధికారులు

జూలపల్లి: రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీవో అనిల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అబ్బాపూర్‌లో తాగునీటి సరఫరా విభాగం ఏఈ శివప్రసాద్‌తో కలిసి సోమవారం తాగునీటి బావులు, బోరును, ట్యాంకులను ఆయన పరిశీలించారు. అనంతరం మంచినీరు సరఫరా చేసే పైపులైన్లు, నల్లా కనెక్షన్లు, గ్రామపంచాయతీ కార్యాలయంలో మంచినీటి సరఫరాకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎంపీవో వెంట కార్యదర్శి ముహమిన్, కారోబార్ పుట్ట మల్లేశం, సిబ్బంది తదితరులు ఉన్నారు.

భారత మహిళా ఖోఖో జట్టు కోచ్‌కు సన్మానం


నరేశ్‌నాయక్‌ను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ధర్మారం: మండలంలోని బంజేరుపల్లి తండాకి చెందిన మహిళా ఖోఖో జట్టు కోచ్ నరేశ్‌నాయక్‌ను మండల కేంద్రంలో అలయన్స్‌క్లబ్, లయన్స్‌క్లబ్‌లు సోమవారం వేర్వేరుగా సన్మానించాయి. ఆయా కార్యక్రమాల్లో అలయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడిశెట్టి శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్‌శెట్టి, రెండు గ్రూపుల సభ్యులు, రీజియన్ చైర్మన్లు సురేందర్‌గౌడ్, జోన్ చైర్మన్ కామిని శ్రీనివాస్, ఎలగందుల అశోక్, సామ ఎల్లారెడ్డి, ముజాహిద్, కట్ట రమేశ్, నాడెం శ్రీనివాస్, చంద్రకాంత్‌రెడ్డి, మురళి, చంద్రమౌళి, సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పిల్లిపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ ఆలయంలో వసంత పంచమిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి అమర్చే రాతి దర్వాజకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రాజేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు.ఆ లయ పూజారి ఉద్దండ నవీన్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మాజీ ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, రాంగోపాల్‌రెడ్డి, భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ పునర్ నిర్మాణ దాత నల్ల మనోహర్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పొట్టాల మల్లేశం, పాటకుల అనిల్, వజ్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌మోసాల నియంత్రణపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్సై ప్రసాద్

కమాన్‌పూర్: మండలంలోని గుండారంలో ప్రస్తుతం జరుగుతున్న సైబర్ మోసాలు, దొంగతనాలపై పోలీస్ కళాజాత బృందం కార్యక్రమం నిర్వహించారు. కమాన్‌పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ హాజరై మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా, ఆధార్ నెంబర్, ఓటీపీ అడిగితే చెప్పొద్దని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. హెడ్ కానిస్టేబుల్ బాబు, కానిస్టేబుల్ వంశీకృష్ణ, కళాజాత బృందం కళాకారులు శ్రీనివాస్, భద్రయ్య, సదయ్య పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ రుక్మిణి

సుల్తానాబాద్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే కుష్టు వ్యాధి దరిచేరదని గర్రెపల్లి పీహెచ్‌సీ డాక్టర్ రుక్మిణి అన్నారు. పట్టణంలో ఉన్న సెంట్ మేరీ హైస్కూల్‌లో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన పక్షోత్సవాలలో భాగంగా సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ దేవిసింగ్, సూపర్‌వైజర్ వెంకటరెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతుల దహనం


నిరసన తెలుపుతున్న నాయకులు

మంథని: మంథని ప్రధాన చౌరస్తాలో సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను సోమవారం దహనం చేశారు. కేంద్రం 1న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి, కార్మికులకు, అట్టడుగు వర్గాలు, విద్యార్థులకు అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అర్ల సందీప్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేశ్, కులవివక్ష పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు మంథని లింగయ్య, నాయకులు బూడిద తిరుపతి ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా స్వామి

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంట గ్రామానికి చెందిన ఎక్కిరాల స్వామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. టీపీసీసీ నాయకుడు పెర్క శ్యాం పెద్దపల్లిలో జరిగిన కార్యక్రమంలో స్వామిని సన్మానించారు. 7న జరిగే లక్షడప్పుల కార్యక్రమం విజయవంతం చేయాలని శ్యాం కోరారు.

సింగరేణి వార్తలు

సీనియారిటీ ప్రకారం సర్ఫేస్ ఖాళీలు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

గోదావరిఖని: సింగరేణిలో డిప్యూటేషన్ల దందా బంద్ చేసి సీనియారిటీ ప్రకారం సర్ఫేస్ ఖాళీలను భర్తీ చేయాలని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనియన్‌ను విస్తృత పర్చేందుకు కార్యాచరణ ప్రారంభించామని, సభ్యత్వ నమోదు చేపట్టామని తెలిపారు. రెఫరల్‌పై హాస్పటల్ వెళ్లిన కార్మికుల దగ్గర నుంచి టెస్టుల పేరుతో పైసలు వసూలు చేయడాన్ని బంద్ చేయాలని. ప్రతి పైసా సింగరేణి యాజమాన్యమే భరించాలని కోరారు. గత నెల 26న ఆర్జీ-1 ఏరియా కార్యవర్గ సమావేశం నిర్వహించి నూతన కమిటీ ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడిగా ఖయ్యూం, సెక్రటరీగా పల్లె క్రాంతికుమార్, కోశాధికారి దుర్గం శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి దొబ్బేటి సతీశ్‌తో పాటు 43మందితో పూర్తి కమిటీ ప్రకటించినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు జక్కుల నారాయణ, ఎంఏ ఖయ్యూం, పల్లె క్రాంతికుమార్, దొబ్బేటి సతీశ్, సహదేవ్, దూటా రామ్మోహన్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న యువకులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో నాందీ చారిటబుల్ ట్రస్ట్ నేతృత్వంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించగా 40మంది రక్తదానం చేశారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు దాతల నుంచి రక్తం సేకరించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆరోగ్యవంతులు రక్తం అందించి ప్రాణదాతలు కావాలని మాజీ జెడ్పీటీసీలు లంక సదయ్య, వంగళ తిరుపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జూకంటి శిరీష అన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషారాణి, బ్లడ్‌బ్యాంక్ పీఆర్‌వో వెంకటేశ్, టెక్నీషియన్ రాకేశ్, నర్సింగ్ ఆఫీసర్ అదీబా తబుస్సుం, ల్యాబ్ అటెండెంట్ కవిత, మాజీ సర్పంచ మాదాసు సతీశ్, నాందీ చారిటబుల్ వ్యవస్థాపక చైర్మన్ బెల్లంకొండ శ్రీనివాస్‌రెడ్డి, కొల్లూరి హరిప్రసాద్, కుమార్, నల్ల, రాజిరెడ్డి, కాసర్ల మల్లారెడ్డి, పారుపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ ఇబ్రహీం, ఆర్.సదయ్య, కంది సంతోష్, అల్లంల శంకర్, బూషి మంజుల, బైరి శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, కత్తుల వీరయ్య, సుకన్య, పాల శంకర్, మల్లేశం పాల్గొన్నారు.

'సంపన్నులకు దోచిపెట్టేలా బడ్జెట్ ప్రకటన'



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గోదావరిఖని: సంపన్నులకు దోచిపెట్టే విధంగా కేంద్ర బడ్జెట్ ప్రకటించారని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య ఆరోపించారు. స్థానిక శ్రామికభవన్ కార్యాలయం నుంచి ప్రధాన చౌరస్తా వరకు సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేకంగా ఉందన్నారు. విద్య, వైద్యం, రైతు, సంక్షేమం తదితర రంగాలను ఈ బడ్జెట్ విస్మరించిందని విమర్శించాన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, పట్టణ కార్యదర్శి ఎ.మహేశ్వరి, కమిటీ సభ్యులు వి.నాగమణి, నవీన్, భాస్కర్, అనూష,రజిత, మణెమ్మ, అరుణజ్యోతి, సరిత, లక్ష్మి, లావణ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం


సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఓదెల: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన కర్రె సంజీవరెడ్డి నియామకమయ్యారు. దీంతో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొంగర అనిల్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కరీంనగర్‌లో ఆయనను సోమవారం కలిసి సన్మానించారు. సంజీవరెడ్డి స్వగ్రామమైన కొలనూర్‌లో పార్టీ నాయకులు సంబరాలు జరపుకున్నారు. మాజీ సర్పంచులు మాటూరి వెంకటస్వామి, ఖైరున్నీసా తాజ్, నాయకులు కర్రె ప్రభాకర్‌రెడ్డి, సంపత్, కొల్లూరి కుమార్, సదయ్య పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో సంబరాలు

కాల్వశ్రీరాంపూర్: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన కర్ర సంజీవరెడ్డి నియామకంపై పార్టీ నాయకులు స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం సంబరాలు జరుపుకున్నారు. నాయకులు శంకరాచారి, చల్లా చంద్రమౌళి, ములుకోజు వెంకటేశ్వర్లు, జంగ రాజయ్య, కూస రాజు, రఫీ, రాజ్‌కుమార్, బాలు పాల్గొన్నారు.

బీజేపీ, బీజేవైఎం నాయకుల ఆధ్వర్యంలో..

సుల్తానాబాద్: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కర్రె సంజీవరెడ్డిని సోమవారం రాత్రి కరీంనగర్‌లోని ఆయన నివాసంలో సన్మానించారు. బీజేపీ సుల్తానాబాద్ మండల మాజీ అధ్యక్షుడు కొమ్ము తిరుపతి యాదవ్, బీజేవైఎం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చాతరాజు రమేశ్, రాజన్న ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధత హక్కులు కల్పించండి


మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధత హక్కులు కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ కోరారు. ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలో పనిచేస్తున్న వివిధ సెక్షన్ల కాంట్రాక్ట్ కార్మికులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో ఫ్యాక్టరీ యాక్ట్ సిస్టం పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. దీంతో వారికి చట్టబద్ధత హక్కులు, సౌకర్యాలు కల్పించకపోవడంతో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు హైపవర్ కమిటీ వేతనాలు, 22వ జీవో నెంబర్‌ను ప్రభుత్వం గెజిట్ చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాము, పద్మ, దేశాయ్ నాయక్, వెంకటేశ్, రవి, రాంబాయ్, లక్ష్మి, రాజనర్సు, రాంగోపాల్, ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


హోమంలో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ, పోతనకాలనీ, న్యూమారేడుపాక గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. న్యూమారేడుపాక శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పండితులు సరస్వతీ దేవికి పూజలు, హోమాలు చేశారు. బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి, ఆర్జీ-2 ఏరియా ఎస్‌వోటూ జీఎం రాములు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొండిల్ల రాంచందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు కొమ్ము గట్టయ్య, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, భక్తులు పాల్గొన్నారు.